సీతంలో డిజిటల్ డిటాక్స్‌పై కార్యశాల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో డిజిటల్ డిటాక్స్‌పై కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిధిలుగా బ్రహ్మ కుమారీలు రాజయోగిని బి.కె.హేమలత, బి.కె.మంజూషలు పాల్గొన్నారు. సాంకేతికత మన జీవితంలో చాలా ముఖ్యమైన భాగమని, చదువుల నుంచి ఉద్యోగాల వరకు, వినోదం నుంచి విశ్రాంతి వరకు మనం డిజిటల్ తెరలను అవసరం కన్నా ఎక్కువ ఉపయోగిస్తున్నామన్నారు. సాంకేతికత మన ఆరోగ్యానికి దగ్గర సంబంధం ఉందని, మన దృష్టి, నిద్ర, మెదడు అభివృద్ధి, తెలివితేటలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాకవానిపాలెంలో చోరీ

విశాలాంధ్ర - కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పంచాయతీ మునగపాకవానిపాలెం గ్రామంలో ఆదిమూలపు సుధీర్ ఇంట్లో 5తులాల బంగారం, సుమారు 18వేల రూపాయల నగదును దొంగలు దోచుకున్నట్లు సీఐ బాల సూర్యారావు తెలిపారు. ఇంటి యజమానులు గాఢ నిద్రలో ఉండగా, బెడ్ రూమ్ గది కిటికీని గునపంతో తెరచి, బీరువాలో ఉన్న బంగారం, నగదును దోచుకున్నారని, ప్రక్కనే ఉన్న పొదల్లోకి గునపం విసిరేసి పరారయ్యారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుకాణాలను తొలగించాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: మండల కేంద్రంలో బైపాస్ కూడలిలో రోడ్డుకి ఇరువైపుల ఉన్న 34 దుకాణాలను రెండు రోజుల్లోగా తొలగించాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ అన్నారు. సోమవారం దుకాణదారులతో బైపాస్ జంక్షన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు పక్కన ఉన్న 34 దుకాణాలను దుకాణ యజమానులు స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. రెండు రోజుల్లోపు తొలగించకపోతే ప్రభుత్వమే వాటిల్ని తొలగించవలసి వస్తుందని దుకాణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ అప్పలనాయుడు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

మెరుగైన పౌర సేవలందించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మెరుగైన పౌర సేవలు అందించి ఆదర్శ సచివాలయాలుగా తీర్చిదిద్దే బాధ్యత కార్యదర్శులపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు అన్నారు. సోమవారం 26 నెంబరు సచివాలయంలో 22, 23, 24, 25, 26, 27 సచివాలయాల పరిధిలో ఉన్న కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పౌర సేవలను మెరుగుపరచడం, మూమెంట్ రిజిస్టర్‌లను కచ్చితంగా నిర్వహించడం, విధులు పట్ల క్రమశిక్షణగా వ్యవహరించడం, ఖచ్చితత్వాన్ని పాటించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, ఎసిపి అమ్మాజీ రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధృడసంకల్పంతో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి

విశాలాంధ్ర - విజయనగరం: సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న ధృడ సంకల్పంతో ఉన్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. విజయనగరం జిల్లాలోని ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టులను 2024 నాటికి ఒక కొలిక్కి తెస్తామని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రాథమికంగా సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని, త్వరలో సిఎం స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు, వలసలను నివారించేందుకు ఈ ప్రాజెక్టులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటికే ఏజెన్సీలను కూడా ఎంపిక చేయడం జరిగిందని, నిధులు కూడా కేటాయించి, వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబుతో సహా ప్రతీఒక్కరూ రూల్స్ పాటించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. బాబుకు రాష్ట్రంలో ఎక్కడైనా సభను నిర్వహించుకొనే స్వేచ్ఛ ఉందని, అయితే ఇరుకు సందుల్లో సభను నిర్వహించి ప్రజల ప్రాణాలు తీయొద్దని కోరారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ తమ శాఖ పరిధిలో ఉన్న 9 మంది ఐఏఎస్ అధికారులు ఇక నుంచీ నెలలో రెండు సార్లు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారని, ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. వీరంతా జిల్లాల్లో పర్యటించి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుతీరును పరిశీలిస్తారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నలుగురు విద్యాశాఖాధికారులను, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సస్పెండ్ చేయడంపై మంత్రి స్పందించారు. విధుల్లో అలసత్వం కారణంగా తమ శాఖకు చెందిన నలుగురు మోనటరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటే, ఉపాధ్యాయులకు ఏవిధమైన నష్టం వాటిల్లిందని ప్రశ్నించారు. ఆగస్టులో జిల్లాకు పాఠ్యపుస్తకాలను వంపిస్తే, ఇప్పటివరకు విద్యార్థులకు పంపిణీ చేయకపోవడం తీవ్రమైన నిర్లక్షంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈ సంఘటనపై విచారణ చేసి తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

రాష్ట్రంలో కోటి కుటుంబాలను నేరుగా కలిసాం: కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈనెల ఏడో తేదీ నుంచి రాష్ట్రంలోని సుమారు 15 వేల సచివాలయాల పరిధిలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మెగా సర్వే చేపట్టామని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. సోమవారం విజయనగరంలోని తన నివాసం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పేరిట ఏడు లక్షల మంది గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు.. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి ఈ ప్రభుత్వంపై అభిప్రాయాలు తెలుసుకున్నట్లు వివరించారు. ప్రతి చోటా ముఖ్యమంత్రి జగన్ అంటే ఒక నమ్మకం, ధైర్యం కనిపిస్తోందని.. ఈ ప్రభుత్వం పట్ల తాము పూర్తి భరోసాతో ఉన్నట్లు చెబుతున్నారని తెలిపారు. సర్వే ముగియడానికి ఇంకా ఐదు రోజులు సమయం ఉందని, ఇప్పటికే 79 లక్షల కుటుంబాల నుంచి మిస్డ్ కాల్స్ వచ్చాయని వెల్లడించారు. విజయనగరం నియోజకవర్గంలో 91,857 గడపలు ఉంటే.. ఇప్పటి వరకూ 71,407 ఇళ్లకు సర్వే చేశామని చెప్పారు. ప్రతిపక్ష పార్టీ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ వెళ్తోందని.. 10-15 మంది బ్యానర్లు పట్టుకొని వెళ్తే ప్రజలు హర్షించరని కోలగట్ల అన్నారు. వారు వెళ్తూ.. "అమ్మా మీకు ఓటు ఉందా?" అంటూ ఆరా తీస్తున్నారని విమర్శించారు. నమ్మకానికి జగన్ పేరు అయితే... చంద్రబాబు మోసాలకు చిరునామా అన్నారు. ఒక సామాన్యుడు శాసనసభ్యుడు అయితే అభివృద్ధి ఎలా ఉంటుందో తాను చేసి చూపించానని కోలగట్ల తెలిపారు. ఇక్కడ అశోక్ ఎప్పుడూ ప్రజల మధ్యకు రారని.. ఒకవేళ బయటకు వస్తే ఎన్నికలు వచ్చినట్లే అని విమర్శించారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా తాను ఎప్పుడూ ప్రజల మనిషినేనని, వారి మధ్యే ఉంటానని తెలిపారు.

ఉత్తమ పంచాయతీగా కొండ తామరపల్లి ఎంపిక

విశాలాంధ్ర - గంట్యాడ: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పలువురు సర్పంచులకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు సన్మానం చేశారు. అందులో గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామానికి హెల్త్ విభాగంలో జిల్లాలో మూడవ స్థానం లభించింది. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్‌లో కొండ తామరాపల్లి గ్రామ సర్పంచ్ కోడెల ముత్యాల నాయుడును జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోడెల ముత్యాల నాయుడు మాట్లాడుతూ హెల్త్ విభాగంలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య చొరవతో గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో తమ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

ఏఈఎల్ చర్చ్ డెలిగేట్‌గా జేసీ రాజు ఎంపిక

విశాలాంధ్ర - బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద క్రైస్తవ సంఘం ఆంధ్ర సౌవార్థిక లూథరన్ చర్చ్ సంఘానికి బొబ్బిలి సైంట్ ఆండ్రూస్ లూథరన్ చర్చ్‌కి సంభందించిన జెసి రాజును ఏఈఎల్‌సీ డెలిగేట్‌గా చర్చ్ అధికారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత శనివారం విశాఖపట్నంలోని ఉక్కునగరం రూపాంతర దేవాలయంలో విశాఖ సినడ్ 26వ కన్వెన్షన్‌ను ఏఈఎల్‌సి మోడరేట్ బిషప్ పరదేశిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి విజయనగరం శ్రీకాకుళం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల నుండి 61 మంది చర్చ్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో జెసి రాజును ఏఈఎల్‌సీ డెలిగేట్‌గా ఎన్నుకున్నారు. ఈ బాధ్యతలను 2023 నుండి 2027 వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఆయనను చర్చ్ ఫాథర్ శ్యాం కుమార్, పీవీఏ మెర్సీ బాయ్, డేవిడ్, జెవిక్టర్, రమణ, ఝాన్సీ, రామారావు, చిన్నారావు, పి.రాజు, శేఖర్‌లు అభినందించారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాలు మంజూరు చేసేదెప్పుడు..?

విశాలాంధ్ర - బొబ్బిలి: బొబ్బిలి నియోజకవర్గంలో గల బొబ్బిలి మున్సిపాలిటీకి సంబంధించి 31వ వార్డులలో గల నిరుపేదలకు 2019లో గత టీడీపీ హయాంలో రామన్నదొరవలస సమీపాన 2481 టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందని, అయితే వైసీపీ ప్రభుత్వం అవి ఇవ్వకుండా ప్రజలను ఇబ్బంది పెడుతోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబినాయన) అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా ఈ నిర్మాణాలను అలాగే ఉంచి కనీస మౌలిక సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం శరవేగంగా చేపట్టి, మౌలిక సదుపాయాలు కూడా పూర్తిగా ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి పాల్గొన్నారు.

సర్పంచులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - నెల్లిమర్ల: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లిమర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన సర్పంచులను సత్కరించారు. గ్రామాలలో వివిధ అంశాలలో అభివృద్ధి సాధించిన మండలంలోని పదిమంది సర్పంచులకు ఎంపీపీ దుశ్శాలువ కప్పి, బొకేలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహాసభ్యులు శ్రీరాములు నాయుడు, ఇఓపీఆర్డీ హెచ్ భానోజిరావు తదితరులు పాల్గొన్నారు.

మైలాన్ మందుల కంపెనీలో అగ్ని ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలో గల మైలాన్ కంపెనీలో ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఫైర్ ఆక్సిడెంట్ యూనిట్‌లో రియాక్టర్‌లో రా మెటీరియర్లు మిక్సింగ్ చేస్తున్న సందర్భంలో కెమిస్ట్రీ సాయి ఇన్చార్జి నాగేశ్వరరావు కార్మికులను తొందరపెట్టి తగినంత భద్రతా విధానాలు పాటించకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రమేష్, రామకృష్ణ అనే ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఇద్దరు కార్మికులను విజయనగరంలో గల మెడికేర్ హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎస్సై నరేష్ కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్‌లకు అవార్డులు

విశాలాంధ్ర - తెర్లాం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సతివాడ గ్రామ పంచాయితీ సర్పంచ్ వల్ల జానకిరాంప్రసాద్, నెమలాం సర్పంచ్ మజ్జి నరిసింహులకు అవార్డులు వరించాయి. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. పిల్లలను స్నేహ పూర్వకముగా ఉంచినందుకు గాను వల్ల జానకిరాంప్రసాద్‌కి, పేదరికం నిర్మూలన ఉపాధి కల్పనలో అగ్రస్థానంలో నిలిపిన మజ్జి నరిరసింహులకు ఈ అవార్డులు వరించాయి.

డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ సుమారు 30లక్షల మంది ప్రజా ప్రతినిధులతో నడుస్తున్న 'పంచాయితీ రాజ్ వ్యవస్థ' ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాధాన్యతను గాంధీజీ కలల కన్నా రామరాజ్యం పంచాయతీల ఏర్పాటు ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బి.సంధ్యారాణి, కళాశాల అధ్యాపకులు డా. సివిఎస్ రవీంద్రనాథ్ వలీఖాన్, కళాశాల అధ్యాపకులు, భాస్కర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెగా పీపుల్ సర్వేతో సీఎం పాలనపై విశ్వాసం పెరిగింది

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మెగా పీపుల్ సర్వే రాష్ట్రంలోనే కాక దేశంలోనే అత్యంత విజయవంతమైన సర్వేగా నిలిచిందని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై మరింత విశ్వాసాన్ని పెంచిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గం పరిశీలకులు శోభా హైమావతి అన్నారు. సోమవారం స్థానిక కళ్యాణ మండపంలో నియోజకవర్గంలో 90 శాతం పైగా సర్వేలో పాల్గొన్న కుటుంబాలు - మెగా పీపుల్ సర్వేలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన పార్వతీపురం నియోజకవర్గం నిలిచిన సందర్భంగా సచివాలయం కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఏప్రిల్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో "జగనన్నే మా భవిష్యత్తు" పేరుతో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిన విషయం అందరికీ తెలిసినదేనన్నారు. మెగా సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయని జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలోని తొలి 15 రోజుల్లోనే ఒి1 కోటి కుటుంబాలు పాల్గొనగా, సీఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మూడు మండలాలు పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, బొంగు చిట్టి రాజు, కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు అలజింగి రవికుమార్, మామిడి బాబ్జి, బలగ రేవతమ్మ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఎంపీపీ మజ్జి శోభారాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు, మూడు మండలాల జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సర్పంచ్‌లను సత్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ప్రకటించిన 14 గ్రామపంచాయతీల సర్పంచులను సోమవారం జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మెమెంటోలు అందజేసి సత్కరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సర్పంచులను సన్మానించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధుల గ్రామం విభాగంలో పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామపంచాయితీకి రెండవ ర్యాంక్ దక్కిందన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీగా గుమ్మలక్ష్మీపురానికి మొదటి ర్యాంక్, నీటి సమృద్ధి గల గ్రామం విభాగంలో పాలకొండ మండలం వెలగవాడ గ్రామ పంచాయతీ, సీతానగరంమండలం జోగింపేట గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్ లభించిందని తెలిపారు. పరిశుభ్రమైన హరిత గ్రామం విభాగంలో సీతానగరం మండలం జోగింపేటగ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్, స్వయం సమృద్ధి ఉన్న మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామం విభాగంలో కురుపాం మండలం పెద్దసొత్తీలి గ్రామపంచాయతీకి మొదటి ర్యాంక్, గురుగుబిల్లి మండలంలోని గురుగుబిల్లి గ్రామ పంచాయతీకి రెండవ ర్యాంక్ దక్కిందన్నారు. సామాజికంగా సురక్షితమైన గ్రామం విభాగంలో గరుగుబిల్లి మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ మొదటి ర్యాంక్ దక్కించుకుందన్నారు. సుపరిపాలన కలిగిన గ్రామం విభాగంలో బలిజిపేట మండలం మిర్తివలస గ్రామపంచాయతీకి మొదటి ర్యాంక్, సీతానగరం మండలం జోగింపేట గ్రామపంచాయతీకీ రెండవ ర్యాంక్, బలిజిపేట మండలం పెదపెంకి గ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్ లభించిందని తెలిపారు. లింగ సమానత్వంతో మరింతగా గ్రామాభివృద్ధి విభాగంలో సీతానగరం మండలం జాను మల్లువలస గ్రామపంచాయతీ రెండవ ర్యాంకును, సీతానగరం మండలం దయానిదిపురం గ్రామపంచాయతీ, సీతంపేట మండలం సీతంపేట గ్రామపంచాయతీ మూడవ ర్యాంక్‌లు దక్కించుకున్నాయన్నారు. ర్యాంకులు సాధించడంపట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లాగ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సెక్రటరీలు, పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లంనాయుడువలసలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామంలో సోమవారం ఇదేంఖర్మ - మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టీడీపీ నియోజక వర్గఇన్‌చార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గతమూడున్నరేళ్లలో వైసీపీ అన్నివిధాలుగా వైఫల్యం చెందిందని వివరించారు. నిరుద్యోగం, అడబిడ్డలకు భద్రత ఏది, బాదుడే బాదుడు, మద్యాంధ్ర ప్రదేశ్, ఊసేలేని అభివృద్ధి, కానరాని రోడ్లు, ఇసుక ఇక్కట్లు తదితర అంశాలపై ప్రభుత్వ వైపల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాలనాయుడు, సాల హరిగోపాల్, బుడితి శ్రీనివాసరావు, వాకాడ పారమ్మా, జొన్నాడ తేరేజమ్మ, వాకాడ పారినాయుడు, దాసరి సింహాచలం, సబ్బాన శ్రీనివాసరావు, భాస్కరరావు, రెడ్డి సింహాచలంనాయుడు, శంకరరావు మాస్టారు, శివున్నాయుడు, వెంకటనాయుడు, శంకరరావు, గరికయ్య, యోగీశ్వరరావు, సాయి, లక్ష్మణ, తేలు తిరుపతి, పెంట సురేష్, సతీష్, వంజరాపు గుంప స్వామి, చింతాడ సత్యనారాయణ, పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ సర్పంచులకు సన్మానం

విశాలాంధ్ర - కొమరాడ: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో 12 వంచాయతీలు ఉత్తమ గ్రామాలుగా నిలిచాయి. రాష్ట్రం జిల్లా స్థాయి అధికారులు ఆదేశాల ప్రకారం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి గ్రామాలు గ్రామపంచా యతీలే పట్టుకొమ్మలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.అన్నపూర్ణ, వైసీపీ మండల పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన, కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు ఎం.సురవు నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు శెట్టి మధుసూదన్‌రావు, ఇన్చార్జి ఎంపీడీవో ఎల్వి అప్పారావు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధే ధ్యేయం: సర్పంచ్

విశాలాంధ్ర - కురుపాం: పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ధ్యేయంగా వనిచేస్తున్నానని మండలంలో గల పెదగొత్తిలి సర్పంచ్ టి.లోకనాదం అన్నారు. ఉత్తమ వంచాయతీలు జాబితాలో తన వంచాయతీకి అరుదైన గౌరవం దక్కడం చాలా సంతోషంగా ఉందని సోమవారం కలెక్టరేట్‌లో అవార్డును అందుకున్నానని అంతేకాకుండా అవార్డు మరికొంత బాధ్యతలు పెంచిందని అన్నారు. రానున్న రోజుల్లో ఇంకా కష్టపడి పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేసి పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని అన్నారు.

ఉపాధి వేతనదారులతో జనసేన ముచ్చట్లు

విశాలాంధ్ర - పార్వతీపురం: మండలంలోని క్రిష్ణపల్లి గ్రామంలో ఉపాధి హామీపనులు జరుగుతున్న సమయంలో అక్కడ వేతనదారులను జనసేన నియోజకవర్గనేత మోహనరావు కలిసి ముచ్చటించారు. వారికి కూల్ డ్రింక్స్ పంపిణీ చేసి జనసేన పార్టీ భావజాలాన్ని తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో జనసేనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం క్రిష్ణపల్లి గ్రామంలో క్రొత్తగా నిర్మాణం చేస్తున్న కల్యాణ మండపానికి 50వేల రూపాయాలు విరాళంను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా జనసేన నాయుకులు, మండల అధ్యక్షురాలు ఆగురుమణి, బోనెల గొవిందమ్మ, గుంట్రెడ్డి గౌరీశంకర్, బంటు శిరీశ్, చిట్లుగణేశ్, తేజ, పవన్, రమేశ్, అప్పలనాయుడు, ఈశ్వర్, ఉపేంద్ర, రాజు, రామకృష్ణ, ప్రవీణ్, హారీశ్ పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

వైద్య సేవలపై డీఐఓ ఆరా

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని నీలకంఠాపురం మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గుమ్మ, పి. లేవిడి, కొండ బారిడి గిరిజన గ్రామాలను సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, హై రిస్క్ గర్భిణీలు, బాలింతలు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ చిన్నారుల బరువులను పరిశీలించారు. మొండెంఖల్లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధులు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బి.ప్రజ్ఞ, అభినవ్ కుమార్, అమరసింహారెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత సీఎందే

విశాలాంధ్ర - సాలూరు టౌన్: హామీలను ఇచ్చి అన్నింటినీ నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జేఏసీ కన్వీనర్ గిరి రఘు తెలిపారు. సాలూరు మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, వార్డ్ కౌన్సిలర్ గిరి రఘు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర నివాసంలో పట్టణ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కన్వీనర్లు, వివిధ మెంబర్స్ కార్యకర్తలు సీనియర్ నాయకులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో గిరి రఘు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న నవరత్నాలపై అనుకున్న మాట నెరవేర్చారని అన్నారు. దేశంలో నెంబర్ వన్ ముఖ్యమంత్రిగా జగన్ నిలిచారన్నారు. సాలూరు నియోజక వర్గంలో ఐదవ సారి పీడిక రాజన్న దొరని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని సర్వేలు చెబు తున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మను వంగపండు అప్పలనాయుడు, వైసీపీ నాయకులు జరజాబు సూరిబాబు, 16వ వార్డు కౌన్సిలర్ రాపాక మాధవరావు, లింగాల సింహాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 10వ రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. డ్రీమ్ యంగ్, చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ విజయవాడ వారు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 4 బంగారు పతకాలు, 7 వెండి పతకాలను విద్యార్థులు గెలుపొందడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.శ్రీనివాసరావు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు శేషగిరి, సైన్స్ ఉపాధ్యాయుడు గోవిందరావు, సహోపాధ్యాయులు విద్యార్థులు ప్రతిభను ప్రశంసించారు.

సీసీఎల్ఏ తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలి

విశాలాంధ్ర - బెలగాం : పేదలు సాగు చేస్తున్న డి -పట్టా భూములను కోటిపాం థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇవ్వచూపుతున్న ప్రభుత్వ సిసిఎల్ఎ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, గతంలో 642 ఎకరాలు నేడు మరల 32 ఎకరాలు భూమిని థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్న రెవెన్యూ యంత్రాంగం చర్యలను ఆపాలని సోమవారం పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొమరాడ మండలం కోటిపాం దగ్గర గతంలో థర్మల్ పవర్ ప్లాంట్ కట్టడానికి ప్రభుత్వం జీవో నెంబర్ 466 ద్వారా 642 ఎకరాల భూమిని కేటాయించిందని ఈ భూములను పవర్ ప్లాంట్‌కు ఇవ్వరాదని గతంలో ఆందోళనలు జరిగాయని, ఈ భూములన్నీ కోటిపాం గుమ్మడ, కొమరాడ, చినఖేర్జల పంచాయతీలకు చెందిన ఎస్టీ, ఎస్సీ పేద వర్గాలు సాగు చేస్తున్న భూములన్నారు. వీరికి ఈ భూములు తప్ప వేరే సాగు భూములు లేవని అన్నారు. రెవెన్యూ యంత్రాంగం మరో 32 ఎకరాల భూమిని థర్మల్ పవర్ ప్లాంట్‌కి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని దీనితో అక్కడ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి డి.వర్మ, సహాయ కార్యదర్శులు పి.శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు కోటిపాం, గుమడ అగ్రహారం, కొమరాడ, గుమడ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



విశాలాంధ్ర - మక్కువ: మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు అన్నారు. మక్కువ మండల టీడీపీ నాయకులు అచ్చెన్నాయుడును సోమవారం శ్రీకాకుళంలో మక్కువ టీడీపీ మాజీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో కలిశారు. విభేదాలు లేకుండా అందరూ కలసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు చొక్కాపు బుచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ప్రతిష్టాత్మకం: మంత్రి బొత్స

విశాలాంధ్ర - విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకే కాకుండా, రాష్ట్రానికే ఎంతో ప్రతిష్టాత్మకమని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. మే 3వ తేదీన ముఖ్యమంత్రి చేతులమీదుగా జరిగే ఎయిర్‌పోర్టు శంకుస్థాపనా కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. విమానాశ్రయ శంకుస్థాపన, ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణకు అధికార యంత్రాంగం చేయాల్సిన ఏర్పాట్లపై, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి బొత్స సత్యనారాయణ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లను, ఈ సంద ర్భంగా వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. హెలీప్యాడ్, భూమి పూజ, పైలాన్ ఆవిష్కరణ, బహిరంగ సభ వేదికల వద్ద ప్రత్యేకాధికారులను నియమించి, వారికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పటిష్ట బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్‌పిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, ఎంఎల్‌ఏ శంబంగి వెంకట చినప్పలనాయుడు, ఎస్‌పి దీపిక, జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయితీరాజ్‌తోనే పంచాయతీల అభివృద్ధి

విశాలాంధ్ర - కురుపాం : పంచాయితీరాజ్‌తోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యం అవుతుందని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయితీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వి.వి.శివరామప్ప ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలో గల బియ్యాల వలస, గుజ్జువాయ్, జరడ, కిచ్చాడా, కురుపాం, నీలకంతాపురం మరిపల్లి వలసబల్లేరు, ఊసకొండ పంచాయితీలు సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బి. అన్నాజీరావు, రంగారావు, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాలను తొలగించొద్దు

విశాలాంధ్ర - రామభద్రపురం: ఎన్నో సంవత్సరాలుగా బైపాస్ జంక్షన్‌లో కిరాణా దుకాణాలు నడుపుకుంటూ జీవి స్తున్న దుకాణదారులు పొట్ట కొట్టొద్దని సిఐటీయు నాయకులు బలస శ్రీను అన్నారు. సోమవారం దుకాణ యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పేదల బతుకులు కూల్చడమే తప్ప వారిని ఆదుకోవడం లేదని అన్నారు. గత 50 సంవత్సరాల నుంచి ఈ జంక్షన్లో చిన్న చిన్న కిరాణా దుకాణాలు పెట్టుకొని జీవనం సాగిస్తుంటే వారి షాపులను కూల్చివేస్తామనడం చాలా దారుణమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే కూల్చివేత నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమానదారులు సెలవరెడ్డి కన్నం నాయుడు, తాడ్డి రామకృష్ణ, చొక్కాపూ బంగారు నాయుడు, కని మేరకు చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర - తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొవడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అన్ని శాఖల అధికారులు, సచివాలయ వ్యవస్థ ఎప్పుడూ అందుబాటులో వుంటుందని అక్కడ సమస్య పరిష్కారం కాకపోయినట్లయితే ప్రతీ సోమవారం జరుగు జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో ఇచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత అధికారికి సిఫార్సు చేసి పరిష్కారం చేయబడుతుందని తెలిపారు.

అంబరాన్నంటిన తొలేళ్ళ సంబరాలు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ దుర్గాలమ్మతల్లి తొలేళ్ళ సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామపెద్దలు ప్రజలు ఐకమత్యంతో సుమారు 60వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన బండిప్రభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత శ్రీదుర్గాలమ్మతల్లి ఘటాలు ధరించిన వందలాది మంది మహిళలు అమ్మవారిని గ్రామంలో ఊరేగింపుగా గుడి వరకు డప్పుల వాయిద్యాలతో తరలి వచ్చారు. అనంతరం గ్రామంలోని మహిళలు బండిప్రభకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ తొలేళ్ళ ఉత్సవంలో గ్రామసర్పంచ్ దండుపాటి ముత్యాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చామంతుల లక్ష్మి, వైకే నాయుడు, మాజీ సర్పంచ్ ఏడువాక అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కాగా మంగళవారం అమ్మవారి అనుపోత్సవం వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేయగా ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు కదురమ్యంగా జరపనున్నారు.

స్ప్రేయింగ్‌పై దృష్టి సారించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో మలేరియా వ్యాప్తి జరగకుండా స్ప్రేయింగ్ పకడ్బందీగా చేయాలని జిల్లాకలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. మే, జూన్, జూలై నెలలలో స్ప్రేయింగ్ జరగాలని ఆయన అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, రెవిన్యూ, పంచాయతీ, స్వయం సహాయక సంఘాలు తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. నిర్దేశిత గ్రామాల్లో ప్రతి ఇంటా బయటా మొత్తం స్ప్రేయింగ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. స్ప్రేయింగ్‌ను తీవ్రంగా పరిగణించాలని ఆయన ఆదేశిం చారు. స్ప్రేయింగ్ సక్రమంగా జరగకపోతే మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, అటువంటి పరిస్థితి జిల్లాలో తలెత్తరాదని ఆయన అన్నారు. జిల్లా అధికారులు తమ శాఖకు సంబంధించిన అన్ని విషయాలు స్పష్టంగా సమీక్షించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, మార్గదర్శకాలు ఎక్కడా లోపాలు లేకుండా అమలు చేయాలని ఆయన అన్నారు. విద్యుత్ విభాగాన్ని పర్యవేక్షించుటకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని బాధ్యుడుగా పెట్టాలని ఆయన ఆదేశించారు.వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్ తరచూ తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల్లో అన్ని పరికరాలు వినియోగంలో ఉన్నది లేనిది పరిశీలించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు ఇన్ ఛార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులను విశ్లేషించాలి: కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజా వినతులపై విశ్లేషణ చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో భాగంగా జిల్లా కలెక్టర్ సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ ఐ.ఎ.ఎస్ అధికారులను జిల్లా ఇంచార్జ్‌గా ప్రభుత్వం నియమించిందని, వారి పర్యటనలో కూడా స్పందన వినతుల పరిష్కారంపై సమీక్షిస్తారని అధికరుంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్పందన దరఖాస్తును రెడ్రెస్సల్ చేసిన 24 గంటల్లోనే పిటిషనర్‌తో మాట్లాడాలని తెలిపారు. స్పందనకు 165 వినతులు వచ్చాయి. జె.సి మయూర్ అశోక్, డి.ఆర్.ఓ. గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, మైనారిటీ సంక్షేమ అధికారి లావణ్య పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

మతోన్మాదులను తరిమికొట్టాలి

సీపీఐ నియోజకవర్గ సభ్యులు మద్ది కృష్ణ

విశాలాంధ్ర - వేపాడ/ లక్కవరపుకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత ద్వేషాలతో కులాల మధ్య చిచ్చు పెడుతూ నిరంకుశ మతోన్మాద పరిపాలనతో దేశాన్ని ధనికులకు తాకట్టుపెట్టే యోచనలో ఉన్న ప్రధాని మోదీ, సీఎం జగన్‌లకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. సోమవారం లక్కవరపుకోట మండలంలో ఎస్.కోట నియోజకవర్గం సిపిఐ కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. మోడీ చేస్తున్న పరిపాలన మోసాలను అలాగే దేశాన్ని ప్రధాని అంబానీలకు ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెట్టి దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ప్రజలకు తెలియజేశారు. కేంద్రంలో మోడీని గద్దె దింపాలని మోడీని సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేగల అప్పలరాజు, కండిపల్లి భీముడు, జి అచ్చం నాయుడు, కోన అప్పారావు, సిపిఎం నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలపై వారితో నేరుగా మాట్లాడి వారు సంతృప్తి చెందేవిధంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అదికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 94 ధరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా వెద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథరావు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.జి.కృష్ణాజి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌లను ఎత్తివేయాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: అక్రమ సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము డిమాండ్ చేశారు. నెల్లిమర్ల ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉపాధ్యాయ సంఘాలు నిరసన కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల పేరిట పాఠశాలలకు వెళ్ళి అకారణంగా ఉపాధ్యాయులను, విద్యా శాఖ అధికారులను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని, తక్షణమే సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాధ్ మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చేసిన తప్పులను ఉపాధ్యాయులు, కింది స్థాయి అధికారులపై నెట్టివేసి బలిపశువులను చేయడం భావ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు నాయకులు కె.యస్.యస్.గణేష్, ఎపిటిఎఫ్ నాయకులు చందక అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, యుటిఎఫ్ నాయకులు విజయకుమారి, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత పండగకు కనీస సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలో గ్రామదేవతలు ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ తల్లుల పండగకు కనీస సౌకర్యాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జనసేన పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ నాయుడు తదితరులు జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్‌ను కలిసి పార్వతీపురం గ్రామదేవత పండుగకు పట్టణంలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్ల తర్వాత పార్వతీపురం గ్రామదేవతల పండుగ నిర్వహించేందుకు పట్టణ పెద్దలు, కమిటీలు నిర్ణయించాయన్నారు. ఇప్పుడున్న పట్టణ జనాభాతో పాటు దానికి రెట్టింపుగా పండగకు భక్తులు హాజరవు తారన్నారు. కాబట్టి పార్వతీపురం మున్సిపాలిటీలో ఇప్పటినుండే పారిశుద్ధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. వరహాల గడ్డలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. వీధిలైట్లు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాల న్నారు. పండగ సందర్భంగా పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గడప-గడపకూ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలోని 44వ డివిజన్ అయ్యన్నపేటలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. సోమవారం ఆ డివిజన్‌కు చేరుకున్న ఆయనకు స్థానికులు, వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన బుక్లెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు సైలాడ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లెంక మహేష్ మాట్లాడుతూ ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. అందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ముంగిటకు ధైర్యంగా వెళుతున్నామని చెప్పారు. ప్రజలు కూడా అదే రీతిన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. నగరంలో అభివృద్ధి సరవేగంగా సాగుతోందని, నగర అందాలు మరింత ఇనుమడింప చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి,డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు,జోనల్ ఇన్చార్జులు దూబే, తమ్ము, తాళ్లపూడి పండు పాల్గొన్నారు.

పట్టాలు సరే...పంపిణీ ఎక్కడ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కొండ గంగు బూడి గ్రామ పంచాయతీలోని 9 గ్రామాలకు సంబంధించిన గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములను సర్వే చేసి పట్టాలు సిద్ధం చేశారు కానీ ప్రజలకు పంపిణీ చేయడం మరిచారని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. గత ఏడాది జూన్ 30న ఏపీ రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో కొండగంగు బూడి గ్రామ పంచాయతీలోని 9గ్రామాలకు సంబంధించి 350 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలన్న డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించడం జరిగిందన్నారు. స్థానిక మండల తహసీల్దార్ స్పందించి జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపి మూడు నెలల్లో సర్వే చేసి పట్టాలిస్తామన్న హామీతో నిరసన కార్యక్రమం ఆపడం జరిగిందన్నారు. ఏపీ రైతు సంఘం నాయకుల పోరాట ఫలితంగా తహసీల్దార్ ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ సిబ్బందితో సర్వే పూర్తి చేసి, పట్టాలు సిద్ధం చేశారన్నారు. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా పట్టాలు పంపించి కూడా సిద్ధమయ్యారు కానీ నేటికీ పట్టాల పంపిణీ పూర్తి కాలేదన్నారు. పాలకుల గ్రూపు తగాదాల వలన గిరిజన రైతులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన రైతులకు ఈనెల 27లోపు పట్టాలు పంపిణీ చేయాలని ,పట్టాల పంపిణీలో జాప్యం జరిగితే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి, వంటా వార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు.

మంత్రి అంబటిని కలిసిన అవనాపు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా ఆయన్ని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైసీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డి.సి.ఎం.ఎస్) చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నివాసంలో అంబటి రాంబాబుకి పూలమొక్కను అందించి, శాలువాతో సత్కరించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయానికి స్వర్గీయ నారికేనబిల్లి చలమయ్య శెట్టి కుమారుడు సీతారామయ్య వారి కుమారులు సాయిరాం బ్రదర్స్ (సాయి మినీ బజార్ కందాల వీధి) సుమారు రూ.6000 విలువ చేసే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ శ్రీధర్ మాట్లాడుతూ వీరు అందజేసిన పోటీ పరీక్షల పుస్త కాలు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పుస్తకాలు అందజేసిన దాతలకు గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు 38 వినతులు

విశాలాంధ్ర - సీతంపేట: సకాలంలో స్పందనకు వచ్చే సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీవో కల్పనకుమారి అన్నారు. సీతంపేట ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన స్పందనకు 38 వినతులు వచ్చాయి. గోయిది పంచాయితీ, రసూల్ పేట గ్రామానికి చెందిన సవర చామంతి అనే బాలింత తమ బిడ్డకు ఆహారం నిమిత్తము పాలు ప్యాకెట్లు అవసరమని పీఓకు వినతి సమర్పించగా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ విజయ పార్వతి లోక్టోజన్ పాల్ ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రోసి రెడ్డి, ఈఈ జి.మురళి, ఓఎస్‌డీ యుగంధర్, ఐసిడిఎస్ పివో రంగలక్ష్మి, జిసిసి డిఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా మిత్తిరెడ్డి ధనలక్ష్మి

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోరలి గ్రామ సర్పంచ్ మిత్తిరెడ్డి ధనలక్ష్మికి ఉత్తమ సర్పంచ్‌గా ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, ఈఓపీఆర్డీ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒడిషా రాష్ట్రంలో మే 3 నుంచి 15 వరకు పెద్ద ఎత్తున త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు సోమవారం తెలిపారు. కోరాపుట్ జిల్లాలో కోరాపుట్, జైపూర్ ప్రాంతాల్లో ప్రచారం ఉంటుందన్నారు. ఈ ప్రచారంలో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లోని అన్ని కమిటీ లతో పాటు రాయగఢ్, ఖుర్దా కమిటీలు కూడా పాల్గొంటాయన్నారు. ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఈ ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్ నాయుడు, మాస్టారు సూరిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

శ్రీ దారగంగమ్మతల్లి నిజరూప దర్శనం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రజల ఇలవేల్పు, గ్రామ దేవత, భక్తుల కొంగుబంగారం శ్రీ దారగంగమ్మ అమ్మవారి చిన్న పండుగలో భాగంగా సోమవారం తెల్లవారుజాము నుండి శ్రీ దార గంగమ్మ తల్లి నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి నిజరూప దర్శనము చేసుకుని విగ్రహానికి స్వహస్తాలతో అమ్మవారికి పసుపు, నీళ్లు, పాలతో అభిషేక పూజలు నిర్వహిం చారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రాజ గోపాలాచార్యుల వేద మంత్రోచ్చారణల మధ్య దారగంగమ్మ అమ్మవారి శిలా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహానికి పసుపు చందనంతో కప్పి వేసి పూజలు నిర్వహించారు. కాగా అమ్మవారి చిన్న పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు అమ్మవారి అర్చకులు వెల్లడించారు.

ఉత్తమ ఎంపీపీగా ప్రమీల

విశాలాంధ్ర - పాచిపెంట: విజయనగరం పార్వతీపురం ఉమ్మడి జిల్లాలలో ఉత్తమ ఎంపీపీగా పాచిపెంట ఎంపీపీ బి.ప్రమీలను ఎంపిక చేస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా జడ్పీ కార్యాలయంలో సోమవారం అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పాచిపెంట మండలాన్ని మరింత అభి వృద్ధి పదంలో నడిపించాలని కోరారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఎంపీపీ ప్రమీల మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మరియు గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు రాజన్న దొర సహాయ సహకారాలతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

26న వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం ఉద్యాన కళాశాలలో 26న వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహామండలి సమావేశం నిర్వహించనున్నట్లు సహ పరిశోధన సంచాలకుడు డా. ఎం. సురేష్ కుమార్ తెలిపారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు, ఆంగ్రూ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్. ప్రశాంతి, విస్తరణ సంచాలకులు సుబ్బిరాంరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

13 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

విశాలాంధ్ర - బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మండలం అలజంగి గ్రామానికి చెందిన రేజేటి ఉదయ్ కిరణ్ మద్యం సీసాలు అమ్ముతుండగా 13 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు. అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే 9440902372 కు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎస్.ఐ. చిన్నం నాయుడు, సిబ్బంది చంద్ర ప్రసాద్, జయరామ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర -జామి: ఉపాధి కూలీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎస్‌కోట డివిజన్ నేత దేగల అప్పలరాజు డిమాండ్ చేసారు. సోమవారం మండలంలోని చింతాడ గ్రామంలోని చెరువులలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్ళిన ఆయన కూలీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలపై చర్చించారు. మండుటెండలో, నీడలేకుండానే పనులు చేస్తున్నామని, కనీసం మంచినీరు,మజ్జిగ సదుపాయాలను, టెంట్లు పంపిణీ చేయలేదని కూలీలు వాపోయారు. రెండు పూటలా పనిచేయడం వలన కూలీ గిటుబాటు కావడం లేదని అప్పలరాజు చెబుతూ ఎంఎంఎస్ విదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో ధర్నా చేవడతామని, కూలీల సంతకాలతో ఎంపిడివో వినతి పత్రాన్ని సమర్పించడం జరుగుతుందన్నారు.

అలమండలో రూ.14 లక్షలతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - జామి: మండలంలోని అలమండ పంచాయతీకి విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ తన ఎంపి నిధులనుంచి రూ.14 లక్షలను వివిద అభివృద్ధి పనులను కేటాయించారని స్థాని వైసీపీ నేత కె.శ్రీనివాసరాజు తెలిపారు. రూ.10 లక్షలతో కొత్తగా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలో సామాజిక భవనం నిర్మించడం జరుగుతుందని, అలాగే పలు చోట్ల తాము ప్రతిపాదించిన మేరకు రూ.4లక్షలతో చేతి బోర్లును మంజూరు చేసారన్నారు. ఈమేరకు బోర్లు వేయడాన్ని సోమవారం శ్రీనివాసరాజు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. తమకు అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన ఎంపి ఎంవివి సత్యనారాయణకు శ్రీనివాసరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామానికి చెందిన శివరాజు, ఎల్.రామకృష్ణ, ఎల్.వెంకటరావు, కె.జగదీష్, కాకినాడ సూరిబాబు, చిరంజీవిరాజు, పైడిరాజు, కె.కృష్ణ, కింతటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉమాలక్ష్మికి ఉత్తమ ఎంపీపీ అవార్డు

విశాలాంధ్ర - తెర్లాం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో జిల్లాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో, అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఉత్తమ ఎంపీపీ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: గ్రామ పంచాయతీలలో రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం తక్షణమే జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు బల్స శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలో ఉన్న గ్రీన్ అంబాసిడర్లతో మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఎంపీడీవో రామకు వివిధ సమస్యలతో కూడిన వినతి అందించారు.

జిల్లా ఉత్తమ పంచాయతీగా జాకేరు

విశాలాంధ్ర - వేపాడ: జిల్లాలో ఉత్తమ పంచాయతీగా మండలంలోని జాకేరు పంచాయతీ ఎంపిక కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జాకేరు క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీగా ప్రభుత్వం ఎంపిక చేయడంతో గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా, సిఈఓ ఎం అశోక్ కుమార్ తదితరులు సర్పంచ్ సేవలను కొనియాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకొని శాలువ కప్పి ప్రతిభాపురష్కారాన్ని సోమవారం విజయనగరంలో అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సోంపురం ఎంపీటీసీ సభ్యులు ఆకుల సత్యనారాయణ, బుద్ధ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా జాకేరు పంచాయతీ జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడం పట్ల పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలకు శుభాకాంక్షలు తెలియజేసారు.

పోడుపట్టాల కోసం గిరిజనులు వినతి

విశాలాంధ్ర - పాచిపెంట: మండలంలో గల కొడుకు పంచాయతీకి చెందిన వలసలమడ, కొత్తపేట గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 56 మంది గిరిజన రైతులు ఆరు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు పోడుపట్టాలు ఇవ్వాలని సోమవారం పాచిపెంట తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోటిగిపంట సర్పంచ్ ఎజ్జాడ అప్పలనాయుడు మాట్లాడుతూ పోడు భూములు చేస్తున్న నేటికీ పట్టాలందుకోక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. గతంలో ముగ్గురు తహశీల్దారులకు పోడు పట్టాలు ఇవ్వాలని వినతిపత్రాలు అందించినా స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులతో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

చిన్న మొత్తాల పొదుపు ఏజెంట్ల వెతలను తీర్చాలి

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: పోస్ట్ ఆఫీసులో చిన్న మొత్తాల పొదుపు ద్వారా నెల నెలా ఆర్.డి. కట్టే ఏజెంట్లకు కష్టకాలం వచ్చిందని నెల నుండి ఏజెంట్లు సేకరించిన ఆర్.డి మొత్తాలను పోస్ట్ ఆఫీస్‌లో తీసుకోవడం లేదని ఆర్.డి అసోసియేషన్ ఎస్.కామేశ్వర రావు,వెంకట రావు, సత్య రాయ్, హైమవతి అన్నారు. ఏజెంట్లకు ఐ.డి కార్డులను ఇచ్చే అసలాస్ కార్డ్లు అను స్మాల్ సేవింగ్స్ డిపార్ట్మెంట్ గాని ఇటు పోస్ట్ ఆఫీసులు గాని జారీ చేయకపోవడం వలన ఈ ఆర్.డి లు నిలిపివేయాయని అన్నారు. ఈ మేరకు స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు.

బోరు బావి ప్రారంభం

విశాలాంధ్ర – మెంటాడ: మండల కేంద్రమైన మండల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో పంచాయితీ రాజ్ నిధులతో నిర్మించిన బోరుబావిని సోమవారం గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండిపోని సౌకర్యం కల్పించడమే గ్రామ సర్పంచ్‌గా నా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముగడ లింగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి రామారావు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న వీఆర్వోకు అస్వస్థత

విశాలాంధ్ర-రేగిడి: రేగిడి ఆమదాలవలస మండలం కండిశ గ్రామంలో స్టోన్ ప్లాంటేషన్ పనుల్లో భాగంగా భూములకు సంబంధించి రాళ్ళు పాతుకట్టేందుకు చర్య తీసుకున్నారు. అయితే వీఆర్వో బాబా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యారు.తక్షణమే తహసీల్దార్ టి కల్యాణ చక్రవర్తి స్పందించి 108కు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం రాజాం తరలించారు.

సిబిసిఎన్ఎస్ ఆస్తులను పరిరక్షించండి

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: సిబిసిఎన్ఎస్ ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ సోమవారం డిఆర్ఓ. గణపతిరావుకు సి.బి.సి.ఎన్.సి ఆస్తుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సంఘమిత్ర డాక్టర్ ఆర్‌వెస్ జాన్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1874 నుండి సిబిసిఎన్ఎస్ ఆవిర్భవించి అనంతరం అనేక ఆస్తులను కాపాడుకుంటూ సేవలు చేస్తుందన్నారు. కానీ ప్రస్తుతం వందల ఎకరాల భూములు అన్యాక్రాంతానికి గురి అవుతున్నాయి అన్నారు. ముఖ్యంగా విశాఖపట్నంలో వందల కోట్లు విలువచేసే సి బి సి ఎన్ ఆస్తులు ప్రస్తుతం విశాఖ ఎంపీ ఎం వి వి సత్యనారాయణ స్టేట్స్‌లో ఉన్న స్థలంలో ఆక్రమణలు చేసి అమ్ముకాలు చేపట్టడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సి బి సి ఎన్ సి ఆస్తులను పరిరక్షించాలన్నారు

ఎస్.కోటలో భూముల రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణ శివారు భూముల రీసర్వే ప్రక్రియను సర్పంచ్ జి.సంతోషికుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టడం వలన హద్దులు నక్షమంగా నిర్ణయించబడి భూవివాదాలు సమసిపోతాయని స్పష్టం చేశారు. రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల మూర్తి, మజ్జి గంగరాజు, అప్పలసత్యం, వార్డు సభ్యులు భారతి, రెవెన్యూ వీఆర్వోలు కన్నయ్య, రమణ, ఆదవినాయుడు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని దేవిబొమ్మ జంక్షన్ వద్ద అఖిల డ్రైవింగ్ స్కూల్ యజమాని కాపుగి వేణుకృష్ణ తన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎస్.ఐ జె.తారకేశ్వరరావులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలతో కూడిన వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ, మంచినీరు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన వేణుకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత వసంత సత్యారావు, జర్నలిస్ట్ సంఘ అధ్యక్షుడు డీకే వాసు, ఉప సర్పంచ్ మోపాద కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు యలమంచిలి ఈశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి రేపాక సన్యాసిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి డిగ్రీ విద్యార్థి మృతి

విశాలాంధ్ర – విజయనగరం క్రైమ్: విజయనగరం పట్టణంలో సోమవారం సాయంత్రం పిడుగు పడిన ఘటనలో డిగ్రీ విద్యార్థి ఇజ్రాయిల్ (21) మృతిచెందగా మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. గాజులరేగకు చెందిన ఇజ్రాయిల్ తో పాటు ఆయన స్నేహితుడు అల్లి అఖిల్ గాజుల రేగ సమీపంలో క్రికెట్ ఆడుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో చిన్నపాటి వర్షం కురిసింది. ఈ సమయంలో మృతుడు ఇజ్రాయిల్ తో పాటు అఖిల్, అదే ప్రాంతానికి చెందిన కల్లుగీత కార్మికుడు గొద్ద సురేష్ పై పిడుగు పడటంతో ఇజ్రాయిల్ అక్కడికక్కడే మృతి చెందగా అఖిల్, సురేష్ లు తీవ్రంగా గాయపడి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స చెందుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిళ్లు ఢీ: నలుగురికి గాయాలు

విశాలాంధ్ర – బెలగాం : ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో నలుగురికి గాయాలైన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలం మూలవలస గ్రామానికి చెందిన మర్రి శ్రీనివాసరావు తన స్నేహితునితో మోటార్ సైకిల్‌పై మెరకారు నుండి కృపావలస వెళ్తుండగా సాలూరు మండలం పల్లపేన్నోర్లు గ్రామానికి చెందిన తాడంగి విజయ్, తాడంగి చొక్కెల, సీదరవు శంకర్ ముగ్గురు కలసి మోటార్ సైకిల్‌పై కూలి పని కోసం మక్కువ నుండి దుగ్గేరు వైపు వెళ్తుండగా రెండు మోటార్ సైకిళ్లు సరైనలిన కూడలి ముందు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. శ్రీనివాసరావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

అశోక్ గజపతిరాజుని కలిసిన యువనేత గొంప

విశాలాంధ్ర – శృంగవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గ యువనేత గొంప క్రిష్ణ సీనియర్ నాయకులు మర్యాద పూర్వకంగా మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజుని ఆయన స్వగృహంలో సోమవారం కలిశారు. అశోక్ గజపతిరాజుకి గొంప కృష్ణ, నియోజకవర్గ పరిధి ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, జామి, ఎల్.కోట నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అనంతరం శృంగవరపుకోట నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో చేపట్టబోయే తెలుగుదేశం కార్యక్రమాలు, పార్టీ అభివృద్ధి కోసం చర్చించారు. విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, జామి మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు, సీనియర్ నాయకులు గరుగు సైదినాయుడు, వేపాడ మండల అధ్యక్షుడు గొంప, కొత్తవలస అధ్యక్షుడు గోరపల్లి శివ, వెంకటావు తదితరులు ఉన్నారు.

నడకతో ఆరోగ్యం: డా. శ్రీరామమూర్తి

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: ఎస్వీఎన్ నగర్ వాకర్స్ క్లబ్ 11వ వార్షికోత్సవము సందర్భంగా స్థానిక ప్రైవేట్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు ఏ. శ్రీరామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవాలని అన్నారు. నడక వలన శరీరంలో ఎండార్ఫిన్లు అనబడే హార్మోన్లు విడుదల కావడి ప్రతి ఒక్కరిలో వత్తిడి, కంగారు,ఆందోళనలు వంటి సమస్యలు తగ్గి పూర్తి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ ఏ శంకర్రావు, క్లబ్ గౌరవ సలహాదారులు విశిష్ట అతిథి అల్లిశ్రీనివాసరావు ప్రసంగించారు.క్లబ్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమం పట్ల అభినందనలు తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడు అల్లాడ శివరామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం క్లబ్ నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు వివరించారు. కార్యదర్శి కందుల సంతోష్ వార్షిక నివేదికను సభ్యులకు వివరముగా తెలియజేసారు. కోశాధికారి గుంపిన నారా యణరావు వార్షిక ఆదాయ, వ్యయాలను తెలియజేసారు. క్లబ్బు ప్రతినెల నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమాల్లో విశేష సేవలు అందించిన ముగ్గురు గాయకులు వరహాలరావు, చిరంజీవిరావు,నరేంద్ర కుమార్ లకు అతిథులచే సత్కారం జరిగినది. మరియు 75 సంవత్సరములు పూర్తి చేసుకున్న వాకర్ సభ్యులు ఏ దుర్గాప్రసాదరావు మరియు ఉద్యోగ విరమణ పొందిన పి.వి .గజపతిరావులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంనకు వాకర్ సభ్యులు హాజరయ్యారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తాం: కలెక్టర్

విశాలాంధ్ర – పార్వతీపురం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఒకటి రెండు రోజుల్లో జిల్లా విద్యాశాఖాధికారితో పాటు సస్పెండ్ చేసిన మిగిలిన ఉద్యోగుల సస్పెన్షన్లు ఎత్తివేసే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులు, ఎన్ జి ఓ యూనియన్ నాయకులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆందోళనలు, నిరసనలు ఉపాధ్యాయులు తక్షణమే విరమించి సహకారాన్ని అందించాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తిలో చేస్తున్న కృషి, నూతన సాంకేతిక యాప్ లను వినియోగించడంలో చూపుతున్న చొరవను ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఉపాధ్యాయులు మంచి సేవలు అందిస్తున్నారని, ఉపాధ్యాయుల డిమాండ్ లను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తామని చెప్పారు. విద్యార్థులకు నష్టం వాటిల్లరాదని ఆయన సూచించారు. ఎన్.జి.ఓ సంఘం అధ్యక్షులు జివిఎన్ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో అందరూ కష్టపడి పనిచేస్తున్నారని, అందుకు జిల్లాకలెక్టర్ సహకరిస్తున్నారన్నారు. జిల్లాలో సానుకూల, స్నేహ పూరిత వాతావరణంలో మంచిపాలన సాగుతుందని,ఇటువంటిసమయంలో సస్పెన్షన్ లు జరగడం బాధించిందని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, ఇంచార్జి డిఈఓ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్.బాలకృష్ణరావు, సుర్ల మురళీ మోహన్,కె.విజయ్, సామల సింహాచలం, ఆర్.శ్రీనివాసరావు, యు. గోవిందరావు, బి.ఎస్. కె.సంజీవి, ఎం.మురళి, ధనంజయ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనలు మేరకు మంగళవారం నుండి చేపట్టనున్న కార్యక్రమాలు వాయిదా వేస్తున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు.

ఉద్యమాన్ని నీరుగార్చడం తగదు

విశాలాంధ్ర – బెలగాం : సాక్షి దినపత్రికలో రెవెన్యూ జెఏసి అధ్యక్షుడిని చెప్పుకొని తిరుగుతున్న దివాకర్ ఒక ప్రెస్ మీట్ పెట్టి ఏపి జెఏసి అమరావతి నిజాయితీగా చేస్తున్న ఉద్యమం గురించి అవాకులు చవాకులు పేలిన వార్త ప్రచురితమైన సంగతి అందరికీ తెలిసిందే దీనని దీనిని ఏపి జెఏసి అమరావతి, ఎపిఆర్ఎస్ఎ పార్వతీపురం మన్యం జిల్లా పక్షాన తీవ్రముగా ఖండిస్తున్నామని ఏపి జెఏసి అమరావతి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు గొట్టాపు శ్రీరామమూర్తి, డిజి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల అపరిష్కృత డిమాండ్ల సాధనకై బొప్పరాజు నేతృత్వం వహిస్తున్న ఏపి జెఏసి అమరావతి గత నెల 9వ తేదీ నుండి మొదలు పెట్టిన ఉద్యమం రోజు రోజుకు తీవ్రతరం అవుతున్న దశలో ఆఘ మేఘాల మీద ఒక స్క్రిప్ట్ తయారు చేసి బంటు నంబర్ 2 (దివాకర్) లాంటి దారిన పోయే దానయ్యతో స్టేట్మెంట్లు ఇప్పిస్తూ ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అయ్యా దివాకర్ నిన్న ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన మీ దగ్గర వీటికి సమాధానాలు ఉన్నాయా అని అన్నారు. ఉద్యోగులకు ఇప్పటిదాకా ఎన్ని డిఏలు పెండింగులో వున్నాయి, ఉద్యోగులకు రావలసిన పిఆర్సీ బకాయిల మొత్తం ఎంత, ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల నుండి మాయమైపోయిన డబ్బు ఎంత, దాని జాడేది, ఈహెచ్ఎస్ సబ్ స్క్రిప్షన్ డబ్బుల ఏ కాకులు ఎత్తుకెళ్తున్నాయి, సరెండర్ లీవు కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్న డబ్బులు ఎంత దూరంలో వున్నాయి, సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన సిపిఎస్ హామీ రద్దు గురువు వారం రోజులు పూర్తి కాలేదా, గ్రామ చోదీకి గురవుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఏ మూలన పడిపోయిందన్నారు.

అధికారుల ఆలోచన రాహిత్యంతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర – పూసపాటిరేగ: అధికారులు ఆలోచన రాహిత్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గోవిందపురం సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ నిమిత్తము విద్యుత్ అధికారులు శనివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని ప్రకటించారు. అయితే ఈ ప్రకటన శనివారం ఉదయం పత్రికల్లో వచ్చే విధంగా శుక్రవారం సాయంత్రం సమాచారం అందించారు. దీంతో ప్రజానీకి గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేసే సమయానికి సమాచారం అందరికీ అందక ఎప్పటిలాగే విద్యుత్తు ఉంటుందనుకొని విద్యుత్తు లేని కారణంగా అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఇది ఇలా ఉంటే ఈ విద్యుత్ పూర్తి అంతరాయం కారణంగా పలు గ్రామాలలో త్రాగునీటి సమస్యలు తలెత్తాయి. ఎంత కాస్ట్లీ బైక్‌లో తిరిగిన సైకిల్ విలువ ఎప్పటికీ తగ్గనట్లుగా మంచినీళ్లు దొరకకపోవడంతో ప్రజలు ప్రభుత్వ చేతి బోరింగ్‌లవైపు చూశారు. అయితే మండలంలో అప్పటికే చాలా గవర్నమెంట్ హ్యాండ్ బోర్లు మరమ్మతులకు గురై శిథిలావస్థలో ఉండడం వల్లించుకును అధికారులు లేకపోవడంతో చేసేదేమీ లేక దూర ప్రాంతాలకు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకున్నారు.

ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ చేతిపంపులపై దృష్టి సారించి ప్రభుత్వ చేతి పంపులను తొలగించి ఎవరైనా ఆక్రమంగా వాటి ప్రదేశంలో బోర్లను ఏగించి వాడుకున్నట్లయితే వాటిని స్వాధీన పరుచుకుని ఆ బోర్లలో చేతిపంపులు ఏగించాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు.

గ్రామ పంచాయతీల సర్పంచులకు సత్కారం

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలోని జోగుంపేట రాష్ట్రస్థాయిలో క్లీన్ అండ్ గ్రీన్‌లో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో సర్పంచ్ కల్యాణపు సింహాచలం, కార్యదర్శి కిరణ్ కుమార్‌లను రాష్ట్ర పంచాయితీ రాజ్ కమిషనర్ సూర్యకుల జాయారాణితో సోమవారం ఘనంగా సన్మానించి మెమొంటో అందజేసారు. జాతీయ పంచాయితీ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలు ఎంపిక కావడంతో మండల పంచాయితీ విస్తరణ అధికారి కుమార్ వర్మని జిల్లాపరిషత్ చైర్మన్ చిన్న శ్రీను, జెడ్పీ సీఈవో డాక్టర్ అశోక్ కుమార్, జిల్లా పంచాయితీ అధికారి శ్రీధర్ రాజులు ఘనంగా సత్కరించారు. మన్యం జిల్లాస్థాయిలో జోగుంపేట, జానుమల్లు వలస, దయానిధిపురం గ్రామాలను జిల్లా స్థాయిలో ఎంపిక చేయగా సర్పంచులు యాళ్ళ వెంకట నాయుడు, తెంటు రామారావు, కార్య దర్శులు కె.శంకరరావు, టి. అశోక్‌లను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బి.సత్యనారా యణలు సన్మానించి మెమొంటోలు అందజేసారు. పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని బగ్గందొరవలస, చెల్లం నాయుడువలస, చినభోగిల,నిడగల్లు, పాపమ్మవలస, కొత్తవలస, ఇప్పలవలస గ్రామసర్పంచులు, ఎంపిటీసీలు అక్కెన నారాయణ రావు, వాకాడపారమ్మ, కురమాన రాధ శ్రీనివాసరావు, ఆరుద్రమ్మ, గౌరు నాయుడు, రెడ్డి అనితఅప్పలనాయుడు, చింతల లక్ష్మణరావుకార్యదర్శులు శ్రీనివాసరావు, పీటర్ పాల్,మనోహర్, తిరుపతిరావు, పైడిరాజు,గౌతమి, శ్రీనివాసరావులను ఎంపిపి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, ఎంపిడిఓ ఎం ఎస్ ఎన్ ప్రసాద్ ల ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్‌గా చీమల అచ్చిబాబు నియామకం

విశాలాంధ్ర – శృంగవరపుకోట: విజయనగరం జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్‌గా ఎస్.కోట మండలం లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన చీమల అచ్చిబాబుని నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు ఏపీ ఎస్టీ సెల్ చైర్మన్ పాచిపెంట శాంతికుమారి నియామక పత్రాన్ని జై భారత్ సత్యాగ్రహ దీక్షలో భాగంగా విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా టీసీసీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, శృంగవరపుకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాడి బంగారు నాయుడు, ఏపీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలు తీర్చేందుకు పంచాయతీలు దోహదం



విశాలాంధ్ర, శృంగవరపుకోట: గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను మేలైన పద్ధతిలో తీర్చడానికి పంచాయతీలు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఎస్.కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భముగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని 1993 ఏప్రిల్ 24 నుండి అమలులోకి వచ్చిన 1992 రాజ్యాంగ (73వ సవరణ) చట్టంమునకు గుర్తుగా నిర్వహిస్తారని అన్నారు. గ్రామస్వరాజ్యం అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ వ్యవస్థ అని పేర్కొంటూ, దీన్నే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ, పంచాయతీరాజ్ వ్యవస్థ అని కూడా అంటారని గుర్తు చేశారు. దాదాపు 30 లక్షల మంది ప్రజాప్రతినిధులతో నడుస్తున్న మన వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అని, ఇది ప్రధానంగా మన గ్రామాలకు వెన్నెముకగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భముగా పంచాయితీ స్థాయిలో వివిధ పరిపాలనా విషయములకు సంబంధించి ఉత్తమ సేవలు అందించిన పంచాయితీల సర్పంచులు, సంబంధిత ఎం.పి.టి.సిలను సన్మానించి, ప్రశంసా పత్రములను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పిలు ఇందుకూరి సుధారాజు, వి.వెంకటరమణ, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, మండలంలోని పలువురు సర్పంచులు, ఎం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎమ్పీడిఓ శేషుబాబు, పంచాయితీ విస్తరణాధికారి శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన

విశాలాంధ్ర – పార్వతీపురం: మన్యం జిల్లా పోలీసు ప్రధానకార్యాలయంలో స్పందన కార్యక్రమును సోమవారంనాడు పార్వతీపురం మన్యం జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ నిర్వహించారు.జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు విచ్చేసి వారి సమస్యలను విన్నవించుకున్నారు. ఎస్పీవెంటనే స్పందిస్తూ సంబంధిత పోలీస్ అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణజరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఏడుగురు స్పందనా ద్వారా అందిన అర్జీలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్,ఎస్ బి సిఐ ఎన్. శ్రీనివాసరావు,డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఎన్. వి. ప్రభాకర్, డి.సి.ఆర్.బి, ఎస్ఐ దినకర్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్ పోర్ట్ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: భోగాపురం మండలంలో ఇంటర్నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకి భూములు ఇచ్చిన బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో డిఆర్ఓ. గణపతిరావుకు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర మహిళా రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీ రాజ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె



మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్ట్ 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తలపెట్టి చేయగా మేడుగా శిలాఫలకం వేయించారు గాని నేటికీ భూములు ఇచ్చిన బాధితులకు న్యాయం చేయలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద చదువుతున్న యువత ఉద్యోగ భరోసా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అక్కడ ప్రజలకు హామీ ఇచ్చారని, ప్రభుత్వం వారికి న్యాయం చేసిందని, ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అక్కడ భయభ్రాంతులకు గురి అవుతున్న ప్రజలకు వీరికి న్యాయం చేసే శాశ్వత పత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి రామారావు, వి రాజారావు, డి శేఖర్ తదితర నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర – విజయనగరం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందుబాటులో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానిక సంస్థలు మరింత బలోపేతం అయ్యాయని, ప్రభుత్వ సేవలు ప్రజలకు అత్యంత చేరువ అయ్యాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా సత్కారం జరిగింది. వివిధ పరిపాలనా, సేవా సంబంధిత అంశాల్లో విస్తృత రీతిలో ప్రతిభ కనబరిచి 27 గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికవ్వగా ఆయా గ్రామ సర్పంచులు అవార్డులు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా జెడ్పీ చైర్మన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉత్తమ జడ్పీటీసీలకు, ఎంపీపీలకు సత్కారం

ఉత్తమమైన రీతిలో ప్రజలకు సేవలందించిన పలువురు జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా సత్కారం జరిగింది. బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, నెల్లిమర్ల జెడ్పీటీసీ సభ్యురాలు గర్భపు రామునాయుడు (కొత్తవలస), గొర్లె సుజాత(కురుపాం), రెంక సన్యాసి అప్పల నాయుడు (మెంటాడ), బలగ రేవతమ్మ(పార్వతీపురం)లను జెడ్పీ చైర్మన్ దుశ్శాలు వాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. గంట్యాడ ఎంపీపీ పీరుబండి హైమా వతి, గరుగుబిల్లి ఎంపీపీ అరిటి రామారావు, పాచిపెంట ఎంపీపీ బద్నాన ప్రమీల, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడులను జెడ్పీ చైర్మన్ సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. వీరితో పాటు జెడ్పీ సీఈవో అశోక్ కుమార్, డీపీవో శ్రీధర్ రాజా, డీఎల్డీవో నిర్మల దేవిలను, పంచాయతీ రాజ్ ఉత్తర అధికారులను కూడా సన్మానించారు. ఈ క్రమంలో జెడ్పీ సీఈవో ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, జెడ్పీ సిబ్బంది జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు సత్కారం చేశారు.

బొబ్బిలి: బొబ్బిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు శంబంగి లక్ష్మీ వేణు గోపాల నాయుడు ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లను, సచివాలయ కార్యదర్శులను, సచివాలయ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలో పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం సోమవారం పంచాయితీ సర్పంచ్‌లు , ఎంపీటీసీలతో ఎండీఓ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యన్నారాయణ, ఈఓపీఆర్డీ రేగిడి రాంబాబు పాల్గొన్నారు.మండ స్థాయిలో ఉత్తమ అవార్డులు గెలుచుకున్న సర్పంచ్ లు కు మొదటిగా గొలుగువలస సర్పంచ్ గులిపిల్లి చంద్రవదన్, రెండవ స్థానంలో గోపాలవలస సర్పంచ్ గొండాల కుమారి, రంగప్పవలస సర్పంచ్ రాంబాబు వీరితో పాటు పలు సర్పంచ్ లకు ఎండీఓ, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు.వీరితో గ్రామ సర్పంచ్ లు ,ఎంపీటీసీ లు, సెక్రెటరీలు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని అరగి పాలెం గ్రామంలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్ దుల్ల లక్ష్మీ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దుల్ల లక్ష్మీ మాట్లాడుతూ జగనన్న పాలన ద్వారా గాంధీజీ కలలకన్న గ్రామ స్వరాజ్య పాలన సాగుతుందన్నారు.అనంతరం గ్రామ పరిశుభ్రతకు పాటుపడుతున్న క్లాప్ మిత్రులు(గ్రీన్ అంబాసిడర్స్),విదువాక బంగారయ్యకొత్తపాడ ఈశ్వరరావులతో పాటు పంప్ ఆపరేటర్ గాలి దేముడమ్మకు,దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానం సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తొండవరపు వెంకటరమణ,సచివాలయ కన్వీనర్ దుల్ల సన్యాసినాయుడు, ఉప సర్పంచ్ ముక్క సన్యాసిరావు,పంచాయతీ కార్యదర్శి యశోద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి ప్రసాద్, అంగన్వాడి కార్యకర్త కనక మహాలక్ష్మి,ఆయా సత్యవతి, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు మండల ఈ.ఓ.పి.ఆర్.డి. ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.పి.పి. నీలంశెట్టి గోపమ్మ, కొత్తవలస పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామితో పాటు మండలంలోని పంచాయితీ సర్పంచ్లను, సిబ్బందిని సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కర్రి శ్రీను, గోరపల్లి శివ, సర్పంచ్ లు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కురుపాం: జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాన్ని కురుపాం మేజర్ పంచాయతీలో సోమవారం పంచాయతీ ఈవో కె.చంద్రశేఖర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జి.సుజాత మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా సచివాలయ సిబ్బంది కీలకపాత్ర తీసుకుని పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి.బంగారు నాయుడు, టీవీఎస్ స్వామినాయుడు, జి.సంతోషిని, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వంగర: గ్రామపంచాయతీలలో గ్రామాల అభివృద్ధికి ముందుగా ప్రణాళికలు తయారు చేసుకొని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఎంపీపీ సురేష్ ముఖర్జీ సూచించారు. వస్తువులు, సేవలను జి ఇఎమ్ ద్వారా ఇ గ్రామ్ స్వరాజ్ ప్లాట్ ఫామ్ ద్వారా పొందడానికి వీలు కల్పించడమే ఇ గ్రామ్ స్వరాజ్-జిఇఎమ్ ఇంటిగ్రేషన్ లక్ష్యంగా పేర్కొన్నారు. సోమవారం జాతీయపంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కొప్పరవలస సర్పంచ్ శ్రీరామమూర్తి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, ఎంపిడివో వి.శ్రీనివాసరావు, వంగర సర్పంచ్ ఎం పిటిసి ప్రతినిధి కనగల పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జామి: జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం సోమవారం మండల కేంద్రమైన జామిలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపిడీవో ఎం.సతీష్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయాల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ దినోత్సవ విశిష్టతను ఎంపిడీవో తెలియజేసారు. అలాగే ఈకార్యక్రమంలో పాల్గొన్న మండల వైసీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, చింతాడ సర్పంచ్ అప్పారి సుబ్రహ్మణ్యాలు ప్రస్తుతం పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. అనంతరం ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన పంచాయతీల సర్పంచ్‌లకు సత్కరించారు. వీరిలో పాటు జెడ్పిటీసి గొర్లె సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, వైస్ఎంపిపి ఎన్నింటి వియలక్ష్మి, పలువురు ఎంపిటిసిలను సైతం దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఫ్యూటిఫికేషన్ డైరక్టర్ చలుమూరి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.